క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో బహుభాషా కవి సమ్మేళనం

హన్మకొండ కల్చరల్: వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో బహుభాషా కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు మహమ్మద్ సిరాజుద్దీన్, సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో మధ్యాహ్నం జరగనున్న కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.దామోదర్, ఆత్మీయ అతిథులుగా గ్రంథాలయ మాజీ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, తెలంగాణ టీజీఓఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అన్నమనేని జగన్మోహన్‌రావు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి నాగవెల్లి, బండ్ల తీర్థం

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం స్వామివారి నాగవెల్లి, బండ్ల తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తోట దగ్గర నుంచి డప్పు చప్పళ్ల మధ్య ఆలయానికి గజవాహనంపై ఊరేగింపుగా చేరుకున్న అనంతరం బండ్ల తీర్థం, నాగవెల్లి, ఏకాంతసేవ నిర్వహించనున్నటు ఆలయ కమిటీ సభ్యులు నిగ్గుల సతీష్‌కుమార్, కడార్ల నరేందర్, దువ్వ శ్రీకాంత్ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

నేడు అనంతమల్లయ్య స్మృత్యంజలి సభ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి స్మృత్యంజలి సభ నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అనంత మల్లయ్యశర్మ శివైక్యం పొందడానికి ముందు రచించిన శ్రీక్రోధినామ సంవత్సర పంచాంగాన్ని మధుసూదనానంద సరస్వతి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విద్వత్సభ పండితులు హాజరవుతారని తెలిపారు.

ఓయూ నుంచి శ్యామల చంద్రకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ రొక్కాల శ్యామల చంద్రకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ కంప్రహెన్సివ్ స్టడీ ఆఫ్ ది సింథసిస్ ఆఫ్ గమ్ కారయ బయో కాంపోసిట్ సిల్వర్ నానో పార్టికల్స్ అండ్ ఇట్స్ బయాలజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి బయో కెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలుగా శ్యామల చంద్రకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. బయో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కరుణ రూపుల పర్యవేక్షణలో శ్యామల చంద్ర తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బాధితులను ఆదుకోండి

నయీంనగర్: సహారా కంపెనీ స్కీంలలో చేరి మోసపోయిన వారిని ఆదుకోవాలని సహారా బాధితుల అఖిల పక్ష సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మార్క పూజిత మాట్లాడుతూ తమకు న్యాయం చేయకుంటే మరణమే శరణ్యమని వాపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, బీజేపీ మహిళా కన్వీనర్ డాక్టర్ పద్మజా రాణి, మార్క రాము, వేణు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీసీఎస్ కోఆప్షన్ డైరెక్టర్‌కు సన్మానం



కాజీపేట రూరల్: సీసీఎస్ కోఆప్షన్ డైరెక్టర్‌గా నియామకమైన జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్‌ను కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ బాధ్యులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు పి.రవికిరణ్, ఎస్ఆర్.ప్రశాంత్, దరావత్ రఘు, పి.ప్రశాంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి క్రిస్టియన్ కాలనీకి చెందిన పసునూటి కుమారస్వామి కుమార్తె మేఘన (17) ఇంటర్ మీడియట్ పూర్తి చేసి ఇంటి పట్టునే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దాంతో బాలిక తండ్రి కుమారస్వామి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

విప్లవ వీరుల స్ఫూర్తితో పోరాడాలి



విద్యారణ్యపురి: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



వరంగల్: మాట్లాడుతున్న హకీం నవీద్



ఖిలా వరంగల్: పడమర కోట జంక్షన్ అమరవీరుల స్థూపం వద్ద..



వరంగల్ అర్బన్: వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు



హన్మకొండ చౌరస్తా: నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ బాధ్యులు



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

విద్యారణ్యపురి: విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి పిలుపునిచ్చారు. అమరుల వర్ధంతి సందర్భంగా హనుమకొండ రాంనగర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సోముల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, బాధ్యులు శివరాత్రి కరుణాకర్, సుముద్రాల అనిల్, రాజేష్, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, హనుమకొండలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విప్లవవీరుల వర్ధంతి కార్యక్రమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, బాషబోయిన సంతోష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, కుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయోద్యమ వీరుల స్ఫూర్తితో పోరాడాలి

కేయూ క్యాంపస్: జాతీయోద్యమ వీరుల స్ఫూర్తితో మతోన్మాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు అశోక్‌కుమార్, బాధ్యులు రమేష్, కుమార్ రాథోడ్, ప్రశాంత్, కల్యాణ్, మంగీలాల్, మౌనిక, శిరీష, సురేష్‌రాథోడ్, కల్యాణి, సంగీత, అనూష, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో మొదటి గేట్ వద్ద నిర్వహించి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కంటి పవన్, వినయ్, రాజేష్, హేమంత్, ప్రియాంక, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ఆదర్శం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు కోరారు. హనుమకొండలో పలు కళాశాల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లపెల్లి అరుణ్, జోనల్ ఇన్‌చార్జ్ మనోజ్, బాధ్యులు భరత్, రోహిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఆశ్రమ పాఠశాలలో, ఎస్ఎంహెచ్ గర్ల్స్ హాస్టల్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు అజయ్, హరీష్, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌కుమార్, బాధ్యులు లక్ష్మణ్, రాజ్‌కుమార్, అంజలి, అనూష, శిరీష పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన వీర కిశోరాలు

వరంగల్: దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిన్న వయస్సులో నిండు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీర కిశోరాలని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీంనవీద్ సూచించారు. ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో వారి చిత్రపటాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.టీ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు బానోతు మోహన్, సతీష్, కుమార్, రాజు, భారతి కళాశాల నాయకులు రంజిత్, సోహెల్, సౌజన్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పడమర కోట జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఏఐకేఎంఎస్ నేత రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, సంగీ ఎలేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుధీర్, జన్ను రవి, రాజేందర్, యాకూబ్, యాకాంబ్రచారి, జన్ను శంకర్, మైదం సంజీవ, రాజేందర్, హరిబాబు, పాణి కృష్ణ, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ హెడ్ పోస్టాఫీస్ కూడలిలో..

వరంగల్ అర్బన్: దేశ రైతాంగాన్ని మోసగించిన బీజేపీని తిరస్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు పిలుపినిచ్చారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని రైతాంగ ఉద్యమ విరమణ సమయంలో ఎస్‌కేఎం జాతీయ నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దేశ రైతాంగాన్ని మోదీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలిపారు. వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నం చేసిన బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం నాయకులు గోనె కుమారస్వామి, సోమిడి శ్రీనివాస్, సూదమల్ల భాస్కర్, చిర్ర సూరి, ఓదెల రాజయ్య, మైదం పాణి తదితరులు పాల్గొన్నారు.



కేయూ మొదటి గేట్ వద్ద భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ బాధ్యులు

హనుమకొండ చౌరస్తాలో..

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని జీవన్‌లాల్ కాంప్లెక్స్ ఆవరణలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు చిత్రపటాలకు ఏఐటీయూసీ జిల్లా బాధ్యులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. 5వ డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ ఫేస్ -1 కాలనీలో కాలనీ కమిటీ బాధ్యులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో వారి సాహసాలను కొనియాడారు.

ఆదర్శప్రాయులు.. ఆ ముగ్గురు

హసన్‌పర్తి: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేటి యువతకు ఆదర్శప్రాయులని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచెందర్ అన్నారు. వారి వర్ధంతిని ఎర్రగట్టు గుట్ట సమీపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మౌనిక, రమణారెడ్డి, చందు, రమేష్, వంశీకృష్ణ, సమ్మయ్య పాల్గొన్నారు.

కాజీపేటలో కామదహనం



కామదహనం చేస్తున్న స్థానికులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం శనివారం రాత్రి కామదహనం చేశారు. కుల, మతాలకు అతీతంగా హోలీ పండుగకు ముందురోజు కామదహనం చేయడం అనాది కాలంగా ఆనవాయితీగా వస్తోంది. అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రధాన రహదారిపై ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కామదహనం చేశారు. కార్యక్రమంలో అనగం యాదగిరి, బెదరకోట రంజిత్, చిలువేరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

హసన్‌పర్తి: తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం, మామునూరులోని పశు వైద్య కళాశాల, హనుమకొండలోని పశుసంవర్ధక శాఖ సహకారంతో హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేట, చింతగట్టు గ్రామాల్లో శనివారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, సాధారణ వ్యాధుల పరీక్షలు, శస్త్ర చికిత్స, గాలికుంటు టీకాలు వేశారు. అలాగే ఖనిజ లవణ మిశ్రమం, మందులను అందించారు. కార్యక్రమంలో పశు వైద్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ అమృత్‌కుమార్, డాక్టర్ సునీల్, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ జీవనలత, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ తేజ, డాక్టర్ శివజ్యోతి, డాక్టర్ అరుణ, డాక్టర్ యశస్విని, డాక్టర్ శివ జ్యోతి, పశువైద్యాధికారి డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ ఎన్నిక



సదానందం, అధ్యక్షుడు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో వరంగల్‌కు చెందిన నాటకరంగ కళాకారులైన ఆకుల సదానందం రాష్ట్ర అధ్యక్షుడిగా, డాక్టర్ కాజీపేట తిరుమలయ్య ఉపాధ్యక్షుడిగా, కార్యవర్గ సభ్యుడిగా గుడూరి బాలాజీ, సలహామండలి సభ్యుడిగా వనం లక్ష్మీకాంతారావు ఎన్నికయ్యారు.

సామిల్ కార్మికుల కూలిరేట్లు పెంచాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న సురేష్, కార్మికులు

ఖిలా వరంగల్: ఖమ్మం రోడ్డు, దూపకుంట రోడ్డులోని సామిల్, టింబర్ డిపోల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలిరేట్లు పెంచాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్స్ (బీఆర్‌టీయూ), సామిల్ హమాలీ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు సామిల్ మిల్లు యాజమాన్య అధ్యక్షుడు మడిపోజు రామ్మూర్తి, సభ్యులు జగన్నాథం, కుమారస్వామి, వీరాచారిలకు కార్మికులు శనివారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, సామిల్ హమాలీ గౌరవ అధ్యక్షుడు బోగి సురేష్ మాట్లాడుతూ ప్రతీ రెండేళ్లకోసారి కూలిరేట్లు పెంచాలని, ఈక్రమంలో ఈనెల 31తో ఆ గడువు ముగుస్తుందని చెప్పారు. తక్షణమే నూతన కూలిరేట్లు పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బండారి భిక్షపతి, లింగయ్య, బండి శ్రీను, నీరటి స్వామి, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కాశిబుగ్గ: గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఐసీడీఎస్ వరంగల్ అర్బన్ ప్రాజెక్ట్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఆర్థిక సాయం అందించారు. మహదేవపూర్ ప్రాజెక్ట్ శంకరపల్లి అంగన్‌వాడీ టీచర్ విజయనిర్మల గుండెపోటుతో గత ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ వరంగల్ అర్బన్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్లు శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతుగా రూ.18,800 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎండి.నసీమా, ఉమ, సత్యవేద, సునీత, ఇందిర తదితరులు ఉన్నారు.

మాదిగ హక్కుల కోసం పోరాడాలి



నియామక పత్రం అందిస్తున్న ప్రదీప్

హన్మకొండ: మాదిగ హక్కులు, ఆత్మగౌరవం కోసం నిస్వార్థంగా పోరాడాలని మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ పిలుపునిచ్చారు. హనుమకొండ వడ్డెపల్లిలో మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల సమస్యల కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతోందని చెప్పారు. అనంతరం మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఆయన ప్రకటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొచ్చు రాజ్‌కుమార్ మాదిగ, జిల్లా కార్యదర్శిగా ఇల్లందుల నరేష్, హనుమకొండ మండల అధ్యక్షుడిగా నల్ల విజయ్‌పాల్, కార్యదర్శిగా బొచ్చు హరీష్, ఉపాధ్యక్షుడిగా బొచ్చు రామును నియమించినట్లు వెల్లడించారు. అలాగే, గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ అధ్యక్షుడిగా ఒస్కుల అనిల్, డివిజన్ యువసేన అధ్యక్షుడిగా పసునూరి నవీన్, మహిళా అధ్యక్షురాలిగా బొచ్చు సరోజన, కార్యదర్శిగా పసునూరి పుష్పను నియమించినట్లు ప్రదీప్ వివరించారు.

క్రీడలతో సామాజిక చైతన్యం పెంపు


హసన్‌పర్తి: క్రీడలతో సామాజిక చైతన్యం పెంపొందుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కిట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రొఫెషనల్ కాలేజియట్ టోర్నమెంట్ క్రిట్స్ ట్రోఫీ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు ఇచ్చే ప్రాధాన్యతను క్రీడలకు కూడా ఇవ్వాలని సూచించారు. శారీరక ఎదుగుదలకు ఆటలు దోహదపడుతాయన్నారు. కిట్స్ ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు అవసరమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు కళాశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారితో పాటు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పాభిషేకం



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలో గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు శనివారం పుష్పాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో వివిధ రకాల పూలతో అభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ప్రసాదాలు అందించారు.

శ్వేతార్క ఆలయంలో శని త్రయోదశి పూజలు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శని త్రయోదశి పూజలను అర్చకులు శనివారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో 108 మందితో శనీశ్వరుడికి అర్చకులు తైలాభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

హసన్‌పర్తి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అధికారులు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానిక పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

కాజీపేటలో వాహనాల తనిఖీ



కాజీపేట: లోకసభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. సెక్టోరల్ అధికారి చాణిక్య ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ నుంచి కాజీపేట వైపు వచ్చే వాహనాలన్నింటిని పోలీసులు ఆపి సోదాలు చేశారు. సీఐ వై.సుధాకర్ రెడ్డితో కలిసి ఎస్సైలు శివకృష్ణ, లవన్‌కుమార్, సునీల్‌కుమార్‌తో పాటు సాయుధ పోలీసులు వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాలి



హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



హసన్‌పర్తి: నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

హన్మకొండ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఐటీ, సీబీఐలను కేంద్రం తన జేబు సంస్థలుగా వాడుకుంటోందని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బడా కాంట్రాక్టర్లకు మేలు చేసి రూ.6,500 కోట్ల అవినీతికి బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, రాగుల రమేష్, గొడుగు వెంకట్, దొగ్గెల తిరుపతి, కాడబోయిన లింగయ్య, ధరావత్ భానునాయక్, రాజు, జయశ్రీ, ఉమా, రమ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జేబు సంస్థలుగా ఈడీ, సీబీఐ

హసన్‌పర్తి: ఈడీ, సీబీఐలను తన జేబు సంస్థగా మార్చుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రొయ్యల రాజు విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని అరెస్టులతో కేంద్రం బెదిరింపులకు గురి చేస్తోందని అన్నారు. ఈక్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, సత్యం, కిరణ్, ప్రభాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల హోసన్న పాదయాత్ర



హోసన్న పాదయాత్ర చేస్తున్న పాస్టర్లు

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన హోసన్న ర్యాలీ, పాదయాత్రను బిషప్ డాక్టర్ జాన్ మార్కండేయ జెండా ఊపి ప్రారంభించారు. కాజీపేట చౌరస్తా నుంచి సీబీసీ చర్చి వరకు పాస్టర్లు పాదయాత్ర నిర్వహించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీఎఫ్ అధ్యక్షుడు పాస్టర్ దామెర ఐజాక్, పోలెపాక ఇమ్మానియేల్, క్రిస్టఫర్ బొజ్జ, మంద కుమార్, మాతంగి దేవదాస్, బొక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.